ఈనాడు ఖమ్మం
సోమవారం ఆగస్టు 31, 2026

1381.8 మె.టన్నుల డీఏపీ రాక

చింతకాని: చింతకాని మండలం పందిళ్లపల్లి రైల్వే ర్యాక్‌పాయింట్‌కు 1381.8 మెట్రిక్ టన్నుల డీఏపీ కాకినాడ ప్లాంట్ నుంచి ఆదివారం వచ్చిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. డీఏపీని లారీల ద్వారా జిల్లాలోని సహకార సంఘాలకు, ఎరువుల దుకాణాలకు పంపిణీ చేశారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం: భట్టి

బోనకల్లు, చింతకాని, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఆదివారం ఆయన బోనకల్లు, చింతకాని మండలాల్లో రూ.131 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. బోనకల్లు మండలంలో రూ.57 కోట్లతో ఉన్నతీకరించనున్న కలకోట, రాపల్లి, గన్నవరం, ముసలిమడుగు, లక్ష్మీపురం రహదారికి శంకుస్థాపన చేశారు. రూ.26కోట్లతో బ్రాహ్మణపల్లి-గన్నవరం- రాపల్లి పీడబ్ల్యూడీ రహదారి పటిష్ఠత పనులకు, రాపల్లిలో రూ.20 లక్షలతో పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. నారాయణపురంలో రూ.80.84 లక్షలతో వెయ్యి మెట్రిక్ టన్నుల సహకార సంఘ గోదాము ప్రారంభించారు. మోటమర్రిలో రూ.24.5 లక్షలతో నిర్మించనున్న 300 మెట్రిక్ టన్నుల సొసైటీ గోదాము నిర్మాణానికి, ఎస్సీ కాలనీలో రూ. కోటితో నిర్మించే అంతర్గత రోడ్లు, సైడు కాలువలు, రాయన్నపేట ఎస్సీ కాలనీలో రూ.19లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కలకోటకు నూతనంగా మంజూరైన విద్యుత్ శాఖ సెక్షన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కలెక్టర్ దివాకర, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి, రాయల నాగేశ్వరరావు, నరసింహారావు, పైడిపల్లి కిషోర్, కర్నాటి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



సన్నబియ్యాన్నే వండుకుంటున్నామని భట్టికి తెలుపుతూ బాక్స్ చూపుతున్న మహిళా కూలీ

కూలీలతో మాటామంతీ..

బోనకల్లు మండలంలో రాయన్నపేట వద్ద భట్టి విక్రమార్క తన కాన్వాయిని ఒక్కసారిగా ఆపించి పొలంలో పనిచేస్తున్న వ్యవసాయ కూలీల వద్దకు వెళ్లి పలకరించారు. అప్పుడే భోజనానికి క్యారేజీలు తీస్తున్న వారిని ఆత్మీయంగా పలకరించి ఏం తింటున్నారని ప్రశ్నించగా ఓ మహిళా కూలీ తన బాక్స్ తీసి చూపించారు. సన్నబియ్యం వస్తున్నాయా అని అడగ్గా అదే బియ్యాన్ని వండుకుంటున్నట్లు తెలిపారు. ఉచిత విద్యుత్, ఉచిత బస్సు, పింఛన్లు గురించి అడిగి తెలుసుకున్నారు.

పది విద్యార్థులకు శుభవార్త

● స్నాక్స్‌కు నిధుల కేటాయింపు

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ 2026-27 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు స్నాక్స్ కోసం నిధులు కేటాయించారు. సాధారణంగా పబ్లిక్ పరీక్షలకు రెండు నెలల ముందునుంచే వివిధ సబ్జెక్టుల్లో తర్ఫీదు ఇస్తారు. ప్రభుత్వ స్కూళ్లలో చాలామంది పేద విద్యార్థులే చదువుకుంటున్నారు. పరీక్షల వేళల్లో వీరు ఖాళీ కడుపుతో తరగతులకు హాజరు కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం స్నాక్స్ (అల్పాహారం) అందిస్తుంది. పరీక్షల సమయంలో విద్యార్థులు ఉత్సాహంగా చదువుకునేందుకు ఇదెంతో ఉపయోగపడుతుంది.

నిధులు ఇలా.. (రూ.లక్షలు)
ఖమ్మం: 44.52
భద్రాద్రి 28.87

◆ ఈ నేపథ్యంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థుల స్నాక్స్(అల్పాహారం)నకు ఒక్కొక్కరికి రూ.15చొప్పున కేటాయిస్తూ విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాకు ఎంత మంజూరు చేసింది కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మెనూ ఇదే..
ఉడకబెట్టిన పెసలు, పల్లీ-బెల్లం, చిరుధాన్యాల బిస్కెట్లు, ఉడకబెట్టిన బొబ్బర్లు, ఉల్లి పకోడి, ఉడకబెట్టిన సెనగలు.

ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష

ఖమ్మం కలెక్టరేట్, న్యూస్‌టుడే: నీట్ పీజీ-2026 ప్రవేశ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసినట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం, తనికెళ్లలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాల్లో 642 మంది విద్యార్థులు హాజరుకాగా 26 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. డీఐఈఓ రవిబాబు తదితరులు ఉన్నారు.

కంటికి కనిపించవు.. ఇంటికే వస్తున్నాయి

దుకాణాల్లో నిషేధించినా ఆన్‌లైన్‌లో యథేచ్ఛగా గడ్డిమందు విక్రయాలు

నిఘా

మనుషుల ప్రాణాలకు, పర్యావరణానికి ముప్పుగా మారిన పారక్వాట్, గ్లైఫోసేట్ వంటి గడ్డి నివారణ మందుల విక్రయం, వాడకంపై ప్రభుత్వం నిషేధం విధించింది. క్యాన్సర్ వంటి ప్రాణాంతక రోగాలు తెచ్చిపెట్టే గడ్డి మందులు వాడొద్దని వ్యవసాయ శాఖాధికారులు ప్రచారం నిర్వహించారు. పురుగు మందుల దుకాణాల్లో అప్పటికే ఉన్న మందుల వివరాలు నమోదు చేసుకొని 'స్టాప్ సేల్' నిషేధాజ్ఞలు జారీ చేశారు. కానీ, కొన్ని ఈ-కామర్స్ యాప్‌లు, వెబ్‌సైట్‌లపై నియంత్రణ విధించకపోవడంతో ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేయగానే నిషేధిత మందులు ఇంటికే వస్తున్నాయి. -ఈనాడు, ఖమ్మం

ఒక్క క్లిక్‌తో తీసుకొస్తున్నారు..

బహిరంగ మార్కెట్‌లో దొరక్కపోవటంతో చాలామంది రైతులు వివిధ యాప్‌లలో లభ్యమయ్యే గడ్డి మందులకు ఆర్డర్ పెడుతున్నారు. బయట దుకాణాల్లో లభించే ధరకే నేరుగా ఇంటికి వస్తున్న పురుగు మందులను బుక్ చేసుకొని తీసుకుంటున్నారు. ఆన్‌లైన్ మార్కెట్, ఈ-కామర్స్ యాప్‌లపై వ్యవసాయాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వినియోగం పెరుగుతోంది. కొన్ని దుకాణాల్లో ఇంకా అనధికారికంగా విక్రయిస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి.

కలుపు కష్టాలు అధిగమించాలని..

పారక్వాట్, గ్లైఫోసేట్‌లకు యూనివర్సల్ కిల్లర్‌గా మరోపేరు ఉంది. పంట వేయడానికి ముందు వీటిని వాడుతారు. ఇది వాడితే 21 రోజుల వరకు కలుపు రాదు. నేల నిస్సారంగా మారుతుంది. దాదాపు అన్ని పంటలు, ఖాళీ ప్రదేశాలు, పొలంగట్లపై పిచికారి చేస్తున్నారు. ఒక్కో సీజన్‌లో 3-5సార్లు కలుపు తీయాల్సి ఉండటంతో కూలీల ఖర్చును తగ్గించుకోవడానికి రైతులు పారక్వాట్, గ్లైఫోసేట్‌ను విరివిగా వాడుతుంటారు. వీటితో నష్టాలే ఎక్కువగా ఉండటంతో మార్చి 31 నుంచి విక్రయం, వినియోగంపై నిషేధం విధించారు.



మధిర: కంపెనీలు తీసుకెళ్లకపోవడంతో దుకాణంలో ఉన్న నిల్వలు

తిరిగి తీసుకోని కంపెనీలు

జిల్లాలో 500 వరకు ఎరువులు, పురుగు మందుల దుకాణాలున్నాయి. గడ్డి మందులపై నిషేధం అమల్లోకి రాగా.. అన్ని దుకాణాలను అధికారులు తనిఖీ చేసి.. మందుల నిల్వను నమోదు చేసుకున్నారు. స్టాప్ సేల్ పెట్టారు. వాటిని వెనక్కి తీసుకోవాల్సిన కంపెనీలు పట్టించుకోవడం లేదని, చట్ట ప్రకారం రెండు నెలలకు మించి స్టాప్ సేల్ ఉండొద్దని కొంత మంది డీలర్లు చెబుతున్నారు. గడువు తేదీ ముగిస్తే నష్టపోతామని పేర్కొంటున్నారు.

'పారక్వాట్, గ్లైఫోసేట్ కంటే మెరుగ్గా పనిచేసేవి, కొన్ని రకాల మొక్కలను మాత్రమే చంపే ఉత్పత్తులు మార్కెట్‌లో ఉన్నాయి. వాటిపై అవగాహన లేక నిషేధిత ఉత్పత్తులనే వాడుతున్నారు. నిల్వలను కంపెనీలకు తిరిగి వ్వాలని డీలర్లకు చెబుతున్నాం. ఆన్‌లైన్‌లో విక్రయాలను ఉన్నతాధికారులకు చేరవేస్తాం.' - వ్యవసాయ శాఖాధికారులు

పాలేరు జలాశయానికి సాగర్ జలాల చేరిక

కూసుమంచి, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జలాలు ఆదివారం తెల్లవారుజామున పాలేరు జలాశయానికి చేరుకున్నాయి. జిల్లాతో పాటు సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు మిషన్ భగీరథ పథకాల ద్వారా తాగునీరందించేందుకుగాను ప్రభుత్వం సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. జలాశయంలో ప్రస్తుతం 15.90 అడుగుల నీరు నిల్వ ఉండగా, పూర్తిస్థాయిలో 23 అడుగుల వరకు నింపి ఉంచాలని నిర్ణయించారు. 2200 క్యూసెక్కుల నీరు ప్రస్తుతం పాలేరు జలాశయానికి చేరుతున్నాయి.



ఎడమ కాల్వ మొదటి జోన్ నుంచి పాలేరు జలాశయం వైపు ప్రవహిస్తున్న సాగర్ జలాలు

తాగునీటి అవసరాలకే: ఎస్ఈ

మిషన్ భగీరథ పథకాల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు మాత్రమే సాగర్ జలాశయం నుంచి పాలేరు జలాశయానికి నీటిని చేరుస్తున్నట్లు నీటిపారుదల శాఖ ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం నీటి చేరికను, ఇన్‌ఫాల్, ఔట్‌ఫాల్ గేట్లను పరిశీలించారు. గేట్ల లీకేజీ లేకుండా చర్యలు తీసుకోవాలని డీఈఈ, ఏఈ, సిబ్బందికి సూచించారు.

నేటి నగరపాలిక ప్రజావాణి రద్దు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యాలయ ఉద్యోగులందరూ 'సర్' కార్యక్రమంలో నిమగ్నమైనందున రద్దు చేసినట్లు చెప్పారు. నగర ప్రజలు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి లోక్ కల్యాణ్ మేళా

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

వీధి వ్యాపారులకు రుణ మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్రం భావిస్తోంది. వీధి వ్యాపారులుగా దరఖాస్తు చేసుకొని ఇప్పటివరకు మొదటి విడత రుణాలు కూడా తీసుకోని వారికి సెప్టెంబరులో రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా నెల రోజులపాటు 'లోక్‌కల్యాణ్ మేళా' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు.

2471 మందికి క్రెడిట్ కార్డులు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పురపాలికల్లో వేలాది మంది వీధి వ్యాపారులు నమోదు చేసుకున్నా ఆశించిన మేర రుణ లక్ష్యాలు సాధించలేకపోయారు. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్న 'లోక్ కల్యాణ్ మేళా'లో ఉమ్మడి జిల్లాలోని 3,495 మందికి మొదటి విడత రుణం రూ.15వేలు ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నిర్దేశిత తేదీల్లో బ్యాంకర్లు, దరఖాస్తుదారులతో సమావేశాలు నిర్వహించి వీటిని మంజూరు చేస్తారు. ఇదే సందర్భంలో మూడు విడతల రుణాలు తీసుకొని వాటిని సక్రమంగా చెల్లించిన 2471మందికి క్రెడిట్ కార్డులు మంజూరు చేస్తారు. మెప్మా సిబ్బంది ద్వారా రుణ మంజూరు ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

మొదటి విడత లక్ష్యాలు ఇలా..

పుర, నగరపాలకం	రుణ లక్ష్యం	క్రెడిట్ కార్డులు
అశ్వారావుపేట	488	0
కొత్తగూడెం	628	500
మణుగూరు	100	129
ఇల్లెందు	100	148
ఏదులాపురం	348	0
ఖమ్మం	1380	1180
మధిర	115	128
సత్తుపల్లి	100	225
వైరా	100	161
కల్లూరు	136	0

◆ ఇదే సమయంలో ఇప్పటికే ఖమ్మం జిల్లాలో రుణాలు తీసుకున్న 3,222 మంది, భద్రాద్రి జిల్లాలోని 3008మంది వీధి వ్యాపారుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని లక్ష్యాలు నిర్దేశించారు.

◆ భద్రాద్రి జిల్లాలో సెన్సెస్ (అర్బన్ ఛాయలున్న) గ్రామాలైన భద్రాచలం, సారపాక, చుంచుపల్లి, గరిమెళ్లపాడు, లక్ష్మీదేవిపల్లిలో ఒక్కో ప్రాంతంలో 150మంది వీధివ్యాపారులను గుర్తించి రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.

ఆర్టీసీ పాస్

రీజియన్ పరిధిలో పెరిగిన బస్‌పాస్‌ల సంఖ్య

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే

సామాన్యుడి ప్రయాణ సాధనం, సురక్షిత ప్రయాణానికి చిరునామా అయిన టీజీఎస్ఆర్టీసీ వైపు ప్రజలు మళ్లీ కొద్దిమేర మొగ్గుచూపుతున్నారు. ఖమ్మం రీజియన్ పరిధిలోని బస్ పాస్‌ల జారీ గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం వృద్ధి నమోదైంది. ఇదే సందర్భంలో ప్రయాణికుల అవసరాలు, వారు ఎంచుకుంటున్న పాస్‌ల విధానాల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన తరుణంలోనూ డిమాండ్ పెరగడం ఆర్టీసీకి కాస్త ఊరటనే చెప్పాలి.



గణాంకాల్లో వ్యత్యాసం

ఖమ్మం రీజియన్ వ్యాప్తంగా గతేడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో మొత్తం 11,881 బస్ పాస్‌లు జారీ కాగా, ఈ ఏడాది అదే వ్యవధిలో ఇప్పటివరకు ఆ సంఖ్య 13,310కి చేరుకుంది. అంటే మొత్తంగా 1249 అదనంగా జారీ అయ్యాయి. పల్లెవెలుగు నుంచి ఎక్స్‌ప్రెస్ వరకు ఆర్టీసీ సేవల పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగిందనడానికి ఇదే నిదర్శనమని అధికారులు చెబుతున్నారు.

దివ్యాంగులు, రోగులకు భరోసా

గతేడాది 2114 శారీరక దివ్యాంగుల పాస్‌లు జారీ కాగా, ఈసారి 2241కి పెరిగాయి. కిడ్నీ రోగులవి కూడా 88 నుంచి 112కు చేరాయి. ఇక విద్యార్థుల బస్‌పాస్‌ల విషయంలో ఆసక్తికర మార్పులు కన్పిస్తున్నాయి.

- ◆ నెలవారీ విద్యార్థి పాస్‌లు గతేడాది 4,506 జారీ చేయగా ఈ ఏడాది మాత్రం 3,866కు తగ్గాయి. అదే సమయంలో త్రైమాసిక గతేడాది 505 ఉండగా, ఈసారి 584కు పెరిగాయి.
- ◆ ప్రతీనెలా కౌంటర్ల వద్ద క్యూలో నిలబడి రెన్యువల్ చేసుకునే ఇబ్బందిని తప్పించుకోవడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు మూడు నెలల రాయితీకి ఆసక్తి చూపుతున్నారు.
- ◆ నెలవారీ పాస్‌ల సంఖ్య తగ్గడానికి, విద్యా సంవత్సరం ప్రారంభంలో అడ్మిషన్ల జాప్యం కూడా కారణమైనట్టు సమాచారం.

ఎక్స్‌ప్రెస్ వైపు ఉద్యోగుల మొగ్గు

నెలవారీ సీజన్ టికెట్ల విషయంలో ప్రయాణికులు వేగానికి సౌకర్యానికి పెద్ద పీట వేస్తున్నారు. పల్లెవెలుగు పాస్‌ల పెరుగుదల 29గా ఉంటే, ఎక్స్‌ప్రెస్ పాస్‌ల జారీ గతేడాది 1175 నుంచి ఈ సంవత్సరం 1244కు పెరిగింది. రోజువారీ విధులకు హాజరయ్యే ఉద్యోగులు, చిరు వ్యాపారులు, సమయాన్ని ఆదా చేసుకోవడానికి మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. మొత్తం సొంత వాహనాల వాడకం పెరుగుతున్న ప్రస్తుత తరుణంలోనూ, ఖమ్మం రీజియన్‌లో ఆర్టీసీ బస్‌పాస్‌ల సంఖ్య వృద్ధి సంస్థకు సానుకూల అంశంగా అధికారులు అంచనా వేస్తున్నారు. విద్యాసంస్థల వద్దే పాస్ రెన్యువల్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే మరింత మెరుగైన గణాంకాలు ఉంటాయని అభిప్రాయపడుతున్నారు.

గాజుల మైసమ్మ



శ్రావణ మాస ఆదివారం సందర్భంగా తల్లాడలో రంగురంగుల గాజుల అలంకరణతో దర్శనమిచ్చిన కోట మైసమ్మ అమ్మవారు.. తల్లాడ, న్యూస్‌టుడే

పంటల నమోదు వేగవంతం చేయాలి

బోనకల్లు, న్యూస్‌టుడే: డిజిటల్ క్రాప్ సర్వేలో పంటల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య సూచించారు. వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. ఆదివారం చిన్నబీరవల్లి గ్రామంలో నిర్వహిస్తున్న క్రాప్ సర్వేని ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు. వివరాలను నమోదు చేసుకోకుంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో పంటను విక్రయించే సమయంలో నష్టపోయే అవకాశం ఉందని చెప్పారు. ఏవో వినయ్‌కుమార్, ఏఈవోలు పాల్గొన్నారు.

మార్కెట్ల మనుగడతోనే.. మద్దతు ధర

ఖమ్మం వ్యవసాయం, ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

మార్కెటింగ్‌శాఖను పూర్తిస్థాయిలో పటిష్ఠపరచి రైతులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు రాష్ట్రంలో అధికార, అనధికార వ్యాపారాలు చేస్తూ తప్పుడు లెక్కలు చూపిస్తున్న ఖరీదుదారులపై నిఘా ఏర్పాటు చేశారు. వ్యాపారాలు సరళీకృతం చేసే చర్యలు ప్రారంభించారు.



ఆరు ప్రత్యేక తనిఖీ బృందాలు..

రాష్ట్రంలోని ప్రధాన మార్కెట్లు అయిన ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, జనగాం, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఆరు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఖరీదుదారుల కొనుగోళ్లు, రైతుల చెల్లింపులు తదితర అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తూ నివేదికలు తయారు చేసే పనిలో ఉన్నాయి.

క్రయ విక్రయాలకు అవకాశం

ఖమ్మం జిల్లాలో ఖమ్మం, మద్దులపల్లి, నేలకొండపల్లి, వైరా, మధిర, కల్లూరు, సత్తుపల్లి, ఏన్కూరు, మత్కేపల్లి మార్కెట్లు ఉన్నాయి. వీటిలో కేవలం ఖమ్మం, ఏన్కూరు మాత్రమే రెగ్యులేటెడ్ వ్యవసాయ మార్కెట్లు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు, ఖమ్మం జిల్లాలోని కారేపల్లిలో కొత్తగా మార్కెట్లు ఏర్పాటు చేశారు. మధిర, వైరా, మద్దులపల్లిలో అన్ని రకాల మౌలిక వసతులు అందుబాటులో ఉన్నందున అక్కడ నిరంతరం క్రయవిక్రయాలకు అవకాశం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, బూర్గంపాడు, దమ్మపేట, అశ్వారావుపేట, చర్లలో వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. కొత్తగూడెం, ఇల్లెందు, బూర్గంపాడు మార్కెట్లలో కొనుగోళ్లు చేపట్టే అవకాశం ఉంది.

దళారులతో నష్టపోతున్న అన్నదాతలు..

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర దక్కాలంటే వ్యవసాయ మార్కెట్లు మనుగడలోకి రావాల్సిన అవసరం ఉంది. రైతు ముసుగులో పంటలు అమ్ముకుంటూ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్న దళారుల నుంచి కాపాడాల్సిన బాధ్యత వ్యవసాయ మార్కెట్లపై ఉంది. కచ్చితమైన తూకం, ధర ఇప్పించేందుకు రైతులను ఆదుకునే వ్యవస్థ వ్యవసాయ మార్కెటింగ్‌శాఖది. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం వల్ల పంటలు పండక, ఒక వేళ పండినా సరైన ధర రాక రైతులు నష్టపోయే అవకాశం ఉంది.

బహిరంగ వేలంతో ప్రయోజనం..

స్థానిక మార్కెట్లలో కొనుగోళ్లు చేయటం వల్ల జిల్లా రైతులు సుదూర ప్రాంతాలకు వెళ్లి అక్కడ తక్కువ ధరకు అమ్ముకుని దూరభారంతో నష్టపోవాల్సిన అవసరం ఉండదు. బహిరంగ వేలం ద్వారా ఒక్కోసారి మద్దతు ధరకు మించి కూడా ధర వచ్చే అవకాశం ఉంటుంది. 2021-22లో కొత్తగూడెం, 2024-25లో ఇల్లెందు మార్కెట్లతో పాటు టేకులపల్లి సబ్‌యార్డులో మిరప కొనుగోళ్లు చేపట్టారు.

క్రీడలను వ్యాయామంగా సాధన చేయండి



విజేతలతో ఐటీడీఏ పీవో రాహుల్

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: కిన్నెరసాని క్రీడా పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఉమ్మడి జిల్లా ఐటీడీఏ ఉద్యోగుల క్రీడలు ఆదివారం ముగిశాయి. వాలీబాల్, షటిల్, టెన్నికాయిట్ తదితర క్రీడాంశాల్లో ఉద్యోగులు హోరాహోరీగా తలపడ్డారు. విజేత జట్లకు ఐటీడీఏ పీవో రాహుల్ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఉద్యోగులు ఇలానే కలిసి కట్టుగా క్రీడలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. క్రీడలప్పుడే కాకుండా ప్రతి రోజు వ్యాయామంగా ఏదో ఒక క్రీడను ఆడాలన్నారు.

విజేతలు వీరే..: మహిళల వాలీబాల్ పోటీలో భద్రాచలం డివిజన్ ప్రథమస్థానంలో నిలవగా ద్వితీయస్థానంలో దమ్మపేట నిలిచింది. పురుషుల్లో.. ఏకలవ్య గురుకుల ప్రథమ స్థానం సాధించగా భద్రాచలం జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది.

★ మహిళల టెన్నికాయిట్‌లో పార్వతి, పుష్పలత (దమ్మపేట-ఏ) జట్టు ప్రథమస్థానంలో నిలవగా అనూషభాయ్, కవిత (భద్రాచలం-బి) జట్టు ద్వితీయస్థానంలో నిలిచారు.

★ మహిళ చెస్‌లో లత(భద్రాచలం) ప్రథమస్థానం, భారతి(ఖమ్మం) రెండో స్థానంలో నిలిచింది. పురుషుల విభాగంలో రాహుల్‌కుమార్, (ఈఎంఆర్ఎస్ దమ్మపేట) ప్రథమ, శ్రీనివాసరావు(భద్రాచలం) ద్వితీయస్థానాల్లో నిలిచారు.

★ మహిళ షటిల్ పోటీల్లో అనిత, అన్నపూర్ణ ప్రథమ స్థానం సాధించగా, కృపావతి, పార్వతి రెండో స్థానంలో నిలిచారు. పురుషుల విభాగంలో బలరాం, మోహన్ (దమ్మపేట), ఆంజనేయులు, లక్ష్మీనారాయణ (భద్రాచలం-ఏ) జట్టు ఒకటి, రెండు స్థానాల్లో నిలిచారు.

★ మహిళ క్యారమ్స్‌లో ప్రథమస్థానంలో విజయలక్ష్మి, పద్మావతి జట్టు నిలవగా, ద్వితీయస్థానంలో అనూషభాయ్, సరస్వతి జట్టు నిలిచింది. పురుషుల విభాగంలో ఎస్కే నజీర్, బన్సిలాల్ (దమ్మపేట) జట్టు ప్రథమస్థానంలో, అశోక్, రవి (టీడబ్ల్యూ గురుకులం) జట్టు ద్వితీయస్థానంలో నిలిచారు.

★ 60 మీటర్ల పరుగు పందెం మహిళా విభాగంలో కవిత (భద్రాచలం), నిర్మల తొలి రెండు స్థానాలు సాధించారు. పురుషుల్లో అనురాగ్, రాకేశ్ తొలి రెండు స్థానాల్లో నిలిచారు.

★ షాట్‌పుట్‌లో కవిత, నీరజ ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించగా, పురుషుల్లో సుధీర్‌కుమార్, జయప్రకాశ్ ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించారు.

ఆర్చరీ క్రీడా పోటీలు

వైరా, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఆర్చరీ పోటీలు నిర్వహించారు. 65 మంది క్రీడాకారులు పాల్గొనగా రాష్ట్రస్థాయి పోటీలకు 24 మంది ఎంపికయ్యారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆర్చరీ క్రీడపై ఆసక్తి పెరుగుతున్నందున ప్రోత్సహించేందుకు క్రీడలను నిర్వహిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు, వైరా ఏసీపీ సారంగపాణి, కార్యదర్శి పి.శంకరయ్య తెలిపారు. క్రీడా పోటీల్లో పుర ఛైర్‌పర్సన్ కాపా చంద్రకళ, ఎస్సై రామారావు, కాపా మురళీకృష్ణ పాల్గొన్నారు.



విజేతలతో ఏసీపీ సారంగపాణి

మాజీ ఎమ్మెల్యే విగ్రహావిష్కరణలో మంత్రి తుమ్మల

దమ్మపేట, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లా దొమ్మేరులో మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు విగ్రహావిష్కరణలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఏపీ శాసనసభాపతి అయ్యన్నపాత్రుడుతో కలిసి ఆదివారం పాల్గొన్నారు. మంత్రికి స్థానిక తెదేపా నాయకులు ఘన స్వాగతం పలికారు. తుమ్మల మాట్లాడుతూ.. స్వర్గీయ కృష్ణబాబుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన మాటతీరు, మంచితనం, మోములో చిరునవ్వు తనకు ఎన్నటికి గుర్తుండిపోతాయన్నారు. అనంతరం కృష్ణబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. పశ్చిమగోదావరి, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.



కృష్ణబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నిబద్ధతతో 'కారుమంచి' సేవలు



కారుమంచిని సన్మానిస్తున్న కలెక్టర్ దివాకర, చిత్రంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు

ఖమ్మం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖలో మూడు దశాబ్దాలకు పైగా వివిధ హోదాల్లో పనిచేసి కలెక్టరేట్ ఏఓగా ఉద్యోగ విరమణ పొందుతున్న కారుమంచి శ్రీనివాసరావు అందరివాడని, ఎంతో నిబద్ధతతో, సంయమనంతో విధులు నిర్వహించి ఉన్నతాధికారుల నుంచి మెప్పు పొందారని కలెక్టర్ దివాకర, టీజీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు సహా వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, పలు శాఖల అధికారులు కొనియాడారు. కారుమంచి ఉద్యోగ విరమణను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆదివారం వీడ్కోలు, సత్కార సభ నిర్వహించారు. తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగానూ ఆయన పనిచేస్తున్నారని, సమస్యల పరిష్కారంలోనూ కీలకపాత్ర వహించారని పేర్కొన్నారు. కారుమంచి దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, టీజీఓ సంఘం ప్రతినిధులు మోదుగు వేలాద్రి, వెంకటేశ్వర్లు, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు, కస్తాల సత్యనారాయణ, శేష ప్రసాద్, తహసీల్దార్లు సైదులు, కృష్ణప్రసాద్, పుల్లయ్య, రాంబాబు, టీఎన్జీఓ నాయకులు వల్లపు వెంకన్న పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టు ద్వారా నీళ్లు అందించాలి: పోటు

ఏదులాపురం, న్యూస్‌టుడే: పాలేరు నియోజకవర్గానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందించి పంటలను కాపాడాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం గ్రామీణ మండలం ఎంవీపాలెంలో పార్టీ జిల్లా నాయకులు ఎస్.కె.లాల్‌మియా అధ్యక్షతన రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించారు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం-పని విధానం అనే అంశంపై హాజరై మాట్లాడారు. పాలేరు చెరువు కింద కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో 21వేల ఎకరాలకు సాగు, తాగు నీరు అందించాలన్నారు. కోట్లు కేటాయించి ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతున్నామని ప్రకటనలు చేస్తున్నా. . జిల్లా రైతాంగానికి ఉపయోగపడే విధంగా ప్రాజెక్టులు డిజైన్ చేయడంలో జిల్లా మంత్రులు, అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉన్న చెరువులను నింపి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. కేంద్రం నిత్యావసరాలపై 50 శాతం ధరలను పెంచి సామాన్య, మధ్య తరగతి ప్రజలపై భారం మోపిందని ఆవేదన వ్యక్తం చేశారు. అమరుల స్ఫూర్తితో కమ్యూనిస్టు విప్లవకారులు పాలకవర్గ దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. గుర్రం అచ్చయ్య, శ్రీనివాసరావు, సి.వై. పులయ్య, జి.రామయ్య, కమ్మకోటి నాగేశ్వరరావు, మలీదు నాగేశ్వరరావు, శిరోమణి పాల్గొన్నారు.

రామయ్యకు ఘనంగా అభిషేకం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వారానికి ఒకసారి ఉండే అభిషేకం ఆనందం కలిగించింది. వచ్చే ఆదివారం నుంచి ఆంతరంగికంగా అభిషేకం ఉంటుంది. అందులో భక్తులకు ప్రవేశం ఉండదు. ఈ నేపథ్యంలో ఈ ఆదివారం విశేష సంఖ్యలో ధ్రువమూర్తుల అభిషేకం వీక్షించి మొక్కులు తీర్చుకున్నారు. క్షేత్ర విశిష్టతను వైదిక పెద్దలు ప్రవచనం చేశారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం విష్వక్సేన పూజ చేసి పుణ్యాహవాచనం నిర్వహించారు. నిత్య కల్యాణంలో భాగంగా మాంగళ్య ధారణ, జీలకర్ర బెల్లం, తలంబ్రాల వేడుక సంతోషాన్ని చాటింది.



గోదావరికి హారతి అందిస్తున్న పురోహితులు

గోదావరికి దివ్య హారతి: ప్రకృతిని, పవిత్ర నదులను పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని పురోహిత సంఘం అధ్యక్షులు రామావఝుల రవికుమార్ తెలిపారు. ప్రతి వారం తరహాలో ఆదివారం సాయంత్రం భద్రాచలం వద్ద గోదావరికి దివ్య హారతి అందించారు. హారతుల గొప్పదనాన్ని వివరించి విశ్వ శాంతి కోసం మంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలు చేశారు. నదీ ప్రవాహంలో పసుపు కుంకుమ సారె సమర్పించి జనులంతా సుఖశాంతులతో వర్ధిల్లేలా చూడాలని గోదావరికి మొక్కుకున్నారు. భక్తులకు దాతల సాయంతో తీర్థ ప్రసాదాలను అందించి ఆశీర్వచనం పలికారు.

'వాచ్ బుక్ చేస్తే.. పేపర్లు వచ్చాయి'

ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల్లో తక్కువ ధరతో ఆకర్షణీయంగా కనిపించిన వాచీని కొనుగోలు చేద్దామని ఆశపడిన వ్యక్తి వచ్చిన పార్సిల్ విప్పి షాక్‌కు గురయ్యారు. ఖమ్మం నగరం 59వ డివిజన్ దానవాయిగూడేనికి చెందిన చెరుకుపల్లి ఉపేందర్‌ను సామాజిక మాధ్యమాల్లో రూ.వెయ్యికి వాచీ అంటూ కనిపించిన ప్రకటన ఆకర్షించింది. దాని ధర బహిరంగ మార్కెట్‌లో రూ.4వేలకు పైగా ఉంది. తక్కువ ధరకు వస్తోందని ఆర్డర్ పెట్టారు. ఆదివారం వచ్చిన ఏజెంట్‌కి రూ.వెయ్యి చెల్లించి పార్సిల్ తీసుకుని తెరిచారు. దానిలో రెండు టార్చ్ లైట్ల అట్టలు వాటిలో హిందీ న్యూస్ పేపర్ ఉండలుగా చుట్టి కుక్కి ఉన్నాయి. అవాక్కైన వారు సదరు ఏజెంట్‌కి తిరిగి ఫోన్ చేసి పిలిపించారు. వాగ్వాదం అనంతరం సదరు వ్యక్తి పార్సిల్ తీసుకుని వెళ్లారు. నగదు తిరిగి ఇమ్మంటే కంపెనీకి వెళ్లాయని చెప్పాడని, తిరిగి వస్తే ఇస్తానన్నాడని ఉపేందర్ తెలిపారు.

10 మంది అధికారుల బదిలీ

కొత్తగూడెం సింగరేణి: సింగరేణి ఫైనాన్స్ విభాగానికి చెందిన పది మంది అధికారులను బదిలీ చేస్తూ జీఎం పర్సనల్ మురళీధర్ రావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో ఒకరు జీఎం స్థాయి, ఐదుగురు ఏజీఎం స్థాయి, నలుగురు డీజీఎం స్థాయి అధికారులు ఉన్నారు. కొత్తగూడెం ఏరియా ఏజీఎం ఎరుకలి బీభత్స ఎస్టీపీపీ జీఎంగా, కొత్తగూడెం రీజియన్ డీజీఎం బి.సుధీర్ కొత్తగూడెం ఏరియా డీజీఎంగా బదిలీ అయ్యారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: అండర్ 19 జిల్లాస్థాయి చదరంగం పోటీలు ఆదివారం ఖమ్మం దిల్లీ పబ్లిక్ స్కూల్లో ఉత్సాహంగా జరిగాయి. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నీలో 200 మంది బాల, బాలికలు పాల్గొన్నారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టును ఎంపిక చేసేందుకు ఈ పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో ఎస్.రుద్వే శ్రీహాస్ ప్రథమ, కె.అరిహంత్ ద్వితీయ, బాలికల విభాగంలో పి.రితుశ్రీ ప్రథమ, నిహారిక ద్వితీయ స్థానంలో నిలిచారు. జిల్లా కబడ్డీ సంఘం ఛైర్మన్ తుంబూరు దయాకర్‌రెడ్డి విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. డీపీఎస్ ఛైర్మన్ రవీందర్‌రెడ్డి, జిల్లా చెస్ అసోసియేషన్ ప్రతినిధులు వీరన్న, శివకృష్ణ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

ఏమైపోయారో..!

★ బీడీసీఆర్ విశ్రాంత ఏఎస్ఎం కుటుంబంలో అనిశ్చితి

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) రైల్వే అసిస్టెంట్ స్టేషన్ మేనేజర్‌గా పని చేసిన కనకస్వామి కుటుంబంలోనూ నేపాల్ విషాదం చోటుచేసుకుంది. అతను ఇక్కడ విధులు నిర్వర్తించినప్పుడు మేదరబస్తీలో ఉన్నా.. కొంతకాలంగా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వేర్వేరు ఘటనల్లో ఇద్దరు కుమారులను కోల్పోయిన అతనికి మిగిలింది కూతురు మాత్రమే. ఇటీవల నేపాల్‌లో సంభవించిన అనుకోని ఉపద్రవం ఆ కాస్త ఆసరాను తుడిచిపెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న నేపాల్ ఘటనలో కనకస్వామి కూతురు దీప్తి, అల్లుడు శ్రీధర్, మనువడు అభినవ్ ఆచూకీ తెలియడం లేదనే ప్రచారంపై స్పష్టత కొరవడింది. కొన్ని రోజులుగా వారి సెల్‌ఫోన్ల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో వారు ఏమై పోయారో అనే ఆవేదన ఆ కుటుంబాన్ని విషాదంలో నింపింది. బీడీసీఆర్‌లో పని చేసిన నేపథ్యంలో ఆ వార్త దావానంలా వ్యాపించడంతో రైల్వే ఉద్యోగుల్లో సానుభూతి వ్యక్తం అవుతోంది. ముగ్గురు సంతానం కలిగిన కనకస్వామి ఇద్దరు వారసులను కోల్పోయి అల్లుడు శ్రీధర్‌ని కొడుకులా భావించి విశ్రాంత జీవితాన్ని హైదరాబాద్‌లో సాగిస్తున్న క్రమంలో మానస సరోవర్ యాత్రకు వెళ్లిన వారి ఆచూకీపై ఎలాంటి స్పష్టమైన సమాచారం అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై బీడీసీఆర్ ఉద్యోగులు సైతం వారి ఆచూకీ లభించాలని ఆకాంక్షిస్తున్నారు.

ఆస్తి వివాదంలో గొడ్డలితో దాడి

పెనుబల్లి, న్యూస్‌టుడే: ఆస్తి వివాదంతో బావపై బామ్మర్ది గొడ్డలితో దాడి చేసిన ఘటన పెనుబల్లి పాతబస్తీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెనుబల్లికి చెందిన యదిరాజు వెంకటకృష్ణ నాయనమ్మకు చెందిన ఇంట్లో వరసకు మామయ్య అయిన పిట్టల నాగేశ్వరరావు నివాసముంటున్నారు. నాగేశ్వరరావును ఇల్లు ఖాళీ చేయాలని ఆ ఇంటికి సమీపంలోనే నివాసం ఉంటున్న వెంకటకృష్ణ కోరడంతో వారి మధ్య వివాదం తలెత్తింది. ఆ ఇంట్లో తమకూ హక్కు ఉందని నాగేశ్వరరావు అనడంతో పలుమార్లు గొడవలు చోటుచేసుకున్నాయి. ఈ గొడవల నేపథ్యంలో నాగేశ్వరరావుపై వెంకటకృష్ణ శనివారం దాడి చేశాడు. సమాచారం తెలిసి సత్తుపల్లి మండలం నారాయణపురంలో ఉంటున్న నాగేశ్వరరావు కొడుకు శివ పెనుబల్లి వచ్చి శనివారం రాత్రి 11 గంటల సమయంలో దారికాచి వెంకటకృష్ణపై గొడ్డలితో దాడి చేశాడు. వెంకటకృష్ణ గాయపడి అపస్మారక స్థితిలో పడిపోవడంతో.. చనిపోయాడని భావించిన శివ గొడ్డలితో వీఎం బంజర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు, స్థానికులు పెనుబల్లి వైద్యశాలకు, అనంతరం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని సీఐ ముత్తిలింగం, ఏఎస్సై వెంకటేశ్వరరావు ఆదివారం సందర్శించి వివరాలు సేకరించారు. బాధితుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. గాయపడిన వెంకటకృష్ణ వైద్యశాలలో కోలుకుంటున్నాడు.

వీబీ జీరాంజీ ప్రణాళికల తయారీ

★ ప్రారంభమైన గ్రామసభలు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా కేంద్రం రూపొందించిన వీబీ జీరాంజీ చట్టం-2025 అమలు దిశగా గ్రామీణాభివృద్ధి శాఖ అడుగులు వేస్తోంది. జులై ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చిన ఈ పథకం అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి 125 రోజుల పనిదినాలు కల్పించేందుకు వికసిత్ పంచాయతీ ప్రణాళిక(వీజీపీపీ) పేరిట ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనులను గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టారు.

రెండు విడతల్లో ..

ప్రణాళికల తయారీకి రెండు విడతల్లో గ్రామసభలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెల 29 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు మొదటి విడత సభలు నిర్వహిస్తారు. వీటిలో వీబీ జీరాంజీ చట్టం ఉద్దేశాలు, అవగాహన, గ్రామానికి సంబంధించిన ప్రగతి నివేదిక, గత ఏడాది చేసిన పనులు, ఖర్చుల వివరాలు వంటి వాటిపై చర్చిస్తారు. 12 నుంచి 15 వరకు రెండో విడత సభలు నిర్వహించి లబ్ధిదారుల వివరాలు, అంచనా వ్యయం వంటివి వివరిస్తారు. ఆమోదం అనంతరం మండల స్థాయిలో ఏర్పాటు చేసిన మూడు బృందాల పరిశీలనకు పంపుతారు.

318 పనులకు అవకాశం

అన్ని జిల్లాలకు ఒకే విధంగా ప్రభుత్వం పనుల లక్ష్యాలను నిర్దేశించింది. ఖమ్మం జిల్లాకు కేటాయించిన 318 పనుల్లో నీటి భద్రత విభాగంలో 107, గ్రామీణ మౌలిక వసతులకు 90 పనులు, జీవనోపాధి వసతులకు 86, విపత్తుల నివారణకు 35 పనులు చేపట్టనున్నారు. ఈ బృందాలు గ్రామీణ స్థాయిలో క్షేత్ర పర్యటన చేసి, ప్రజలతో చర్చించి గ్రామ వనరుల ఆధారంగా వాటిని అంచనావేయాలి. జలసంరక్షణ పనులకు ప్రాధాన్యమిచ్చేలా చూడాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



తల్లాడలో నిర్వహించిన గ్రామసభ

ట్రాక్టర్ కింద పడి.. తోడల్లుళ్ల దుర్మరణం



నాగరాజు రమేష్

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: వివాహానికి హాజరై ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ కిందపడి మృతి చెందిన దుర్ఘటన ఎర్రుపాలెం మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై రమేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పెసరమల్లి నాగరాజు(32), ఏపీలోని గంపలగూడెం మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కొరకప్పుల రమేష్(45) ద్విచక్ర వాహనంపై బుచ్చిరెడ్డిపాలెంలో ఓ వివాహానికి హాజరయ్యారు. అనంతరం గ్రామంలోని తమ మామ ఇంటి నుంచి ప్రధాన రహదారిపైకి వస్తూ.. అదే సమయంలో మట్టి తరలిస్తున్న బనిగండ్లపాడుకు చెందిన ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. ట్రాక్టర్ ఎదురుగా ఉన్న ప్రహరీని ఢీకొని ట్రక్కు వారిపై పడిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మధిర గ్రామీణ సీఐ మధు, ఎస్సై రమేష్‌కుమార్ ప్రమాదస్థలాన్ని పరిశీలించి ట్రాక్టర్ ట్రక్కును తొలగించి మృతదేహాలను బయటకు తీశారు.

★ మృతి చెందిన నాగరాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రమేష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరూ ఇదే గ్రామానికి చెందిన ముల్లంగి లాజర్ కుటుంబంలో అల్లుళ్లు కావటంతో ఆయా కుటుంబాల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో ఎన్నడూ లేనివిధంగా ఘోర ప్రమాదం జరగటంతో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. కేసు నమోదు చేసి సీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఖమ్మం నగరం మూడోపట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబు కథనం ప్రకారం.. స్థానిక బర్మాషెల్ రోడ్డులో సుమారు 60ఏళ్ల వ్యక్తి మృతి చెంది ఉండగా గుర్తించారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో అన్నం సేవా ఫౌండేషన్ నిర్వాహకుడు అన్నం శ్రీనివాసరావు సహకారంతో సర్వజనాసుపత్రి శవాగారానికి తరలించి భద్రపరిచారు. శవాన్ని గుర్తిస్తే తమ పోలీస్ స్టేషన్‌లో, 87126 59116, 87126 59115లను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ఖమ్మం-మల్లెమడుగు రైల్వేస్టేషన్ల మధ్య ఓ గుర్తు తెలియని వ్యక్తి(45) రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ కె.శ్రీనివాస్ కథనం మేరకు.. నగరంలోని మామిళ్లగూడెం సమీపంలో శనివారం రాత్రి 10:00గంటల ప్రాంతంలో కాట్రా-తిరునల్వేల్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకోపైలట్ ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి జీఆర్పీ పోలీసులు వెళ్లి వివరాలను సేకరించారు. మృతుడి వద్ద చరవాణి లభించినా, సిమ్ కార్డుతో పాటు చరవాణిలోని డేటా అంతా తొలగించబడి ఉందని తెలిపారు. మృతుడి వ్యక్తిగత వివరాలేమి తెలియరాలేదని, అన్నం సేవా ఫౌండేషన్ నిర్వాహకుడు అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని పట్టాలపై నుంచి తొలగించి ఖమ్మం సర్వజనాసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి సమాచారం తెలిస్తే ఖమ్మం జీఆర్పీ స్టేషన్‌లో తెలియజేయాలని హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఉరేసుకుని యువకుడు..



రాజేశ్

ఏదులాపురం, న్యూస్‌టుడే: ఇంట్లో ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఖమ్మం గ్రామీణ మండలం రాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఆరెంపుల గ్రామానికి చెందిన అంబటి రాజేశ్(30) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. తాను నివాసం ఉంటున్న ఇంట్లోనే రేకుల షెడ్‌లోని పైకప్పు ఇనుప రాడ్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు గతంలోనూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. అన్నం ఫౌండేషన్ నిర్వాహకుడు అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్ మీరా తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి..

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఖమ్మం నగరం కవిరాజనగర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కల్లూరు మండలం చెన్నూరుకు చెందిన పెనుగొండ బాలకృష్ణ(40) డ్రైవర్‌గా పనిచేస్తూ నగరంలోని కవిరాజనగర్ 7వ వీధిలో నివసిస్తున్నాడు. మద్యానికి బానిసైన ఆయన ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. కుటుంబ కలహాలతో భార్య ఇటీవల పుట్టింటికి వెళ్లారు. తాను కిరాయికి ఉండే ఇంట్లో ఆదివారం ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఘటనా స్థలాన్ని సందర్శించిన ఖానాపురంహవేలి పోలీసులు విచారణ చేపట్టారు. అతడి మృతదేహాన్ని అన్నం శ్రీనివాసరావు బృందం సహకారంతో సర్వజనాసుపత్రి శవాగారానికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

భార్య మందలించిందని భర్త బలవన్మరణం

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం ఎందుకు తాగావని భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని శనివారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ మండలం మందరికలపాడుకు చెందిన కుంజా నర్సింహారావు (49) కూలీ. కొద్ది రోజులుగా మద్యానికి బానిసై ఏ పని చేయట్లేదు. ఈనెల 29న మద్యం మత్తులో రోడ్డుపక్కన పడగా కుడి కనుబొమ్మ ప్రాంతంలో గాయమైంది. దీంతో భార్య జోగమ్మ మందలించింది. మనస్తాపానికి గురై ఇంట్లో చీరతో ఉరేసుకచున్నాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు గ్రామీణ ఎస్సై సురేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ డంపు స్వాధీనం



చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ మిషన్-2026 ముగిసినప్పటికీ అక్కడి అడవుల్లో భద్రతా బలగాలు ఏరియా డామినేషన్ ఆపరేషన్లను నిరంతరాయంగా కొనసాగిస్తున్నాయి. సుక్మా జిల్లాలోని కొంటా పోలీస్ స్టేషన్ పరిధిలోని బెల్పొచ-గోంపడ్ రహదారి వెంబడి ఉన్న అడవిలో డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్‌డ్ గార్డ్), బస్తర్ ఫైటర్స్ సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో రెండు టిఫిన్ బాంబులు, భారీ పరిమాణంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మరోపక్క నారాయణ్‌పూర్ జిల్లాలో స్థానిక పోలీసులు, బీఎస్ఎఫ్ బలగాలు అదనార్ అడవుల్లో చేపట్టిన ఆపరేషన్‌లో పది రైఫిల్స్, బీజీఎల్ సెల్స్, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి.

సత్తుపల్లి
• సత్తుపల్లి • మధిర • వైరా

కృష్ణా రివర్ క్రాసింగ్‌లో మధిర స్విమ్మర్లు



మధిర, న్యూస్‌టుడే: మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో స్విమ్మర్లు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వేదాద్రి వద్ద కృష్ణా నదిని ఈదుతూ క్రాస్ చేశారు. దాదాపు 30 మంది మధిరకు చెందిన ఈతగాళ్లు ఈ రివర్ క్రాసింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వాసంశెట్టి జనార్దన్‌రావు అనే స్విమ్మర్ మధిర నుంచి సైకిల్‌పై వేదాద్రి చేరుకుని రివర్ క్రాసింగ్‌లో పాల్గొన్నారు. మిగిలిన వారు బైక్ ర్యాలీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో స్విమ్మర్స్ సభ్యులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

కల్లూరు, న్యూస్‌టుడే: పెద్దకోరుకొండి గ్రామంలోని కృష్ణ మిల్క్ యూనియన్ విజయ డెయిరీ ఆధ్వర్యంలో పాడి రైతులకు తొలి విడతగా బోనస్ రూ. 77 వేలను ఆదివారం పంపిణీ చేశారు. సహకార సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ డెయిరీ ద్వారా పశువైద్య శిబిరాలు, పశువుల బీమా, దాణా సరఫరా తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
సత్తుపల్లి : 79933 00536
మధిర : 98668 05652
వైరా : 76619 46938

సమస్య: మధిర మండలం మల్లారం గ్రామ బీసీ కాలనీ రెండో వార్డులో రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు పెరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పంచాయతీ అధికారులు పట్టించుకోవాలి. - **గరిడేపల్లి వెంకటేశ్వర్లు**

సమాధానం: ఈ గ్రామంలో పరిస్థితిని పరిశీలించి పిచ్చి మొక్కలు తొలగించేలా తగు చర్యలు తీసుకుంటాం. - **వెంకటేశ్వర్లు ఎంపీడీఓ** – మధిర గ్రామీణం, న్యూస్‌టుడే

మధిర రాజీవ్‌నగర్‌లో మురుగు కాల్వల్లో పూడిక పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. - **రాజేశ్వరి, రాజీవ్‌నగర్ కాలనీ** ✔ కాలువల్లో పూడిక తొలగించి సమస్యకు పరిష్కారం చూపుతాం.
- **ఉద్దండు, పారిశుద్ధ్య విభాగం జవాను**

మధిర సుందరయ్యనగర్ తాగునీటి సంపు ఎదుటి రహదారిలో చెత్తసేకరణ రోజుల తరబడిగా చేయడంలేదు. ఆ ప్రాంతమంతా దుర్వాసన వ్యాపిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - **జ్యోతి, సుందరయ్యనగర్** ✔ చెత్త సేకరణ ప్రతిరోజూ ఉండేలా చర్యలు తీసుకుంటాం. - **పురపాలక పారిశుద్ధ్య విభాగం బాధ్యులు**
– మధిర పట్టణం, న్యూస్‌టుడే

మధిర నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: భట్టి

చింతకాని, బోనకల్లు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మధిర నియోజకవర్గం ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. చింతకాని మండలంలోని కొదుమూరు, లచ్చగూడెం, చింతకాని, నాగిలిగొండ గ్రామాల్లో ఆదివారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. కొదుమూరు ఎస్సీ కాలనీలో రూ. 66 లక్షలతో నిర్మించే సీసీ రహదారులు, లచ్చగూడెంలో రూ. 29కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణానికి, రూ. 8.50కోట్ల వ్యయంతో నిర్మించే లచ్చగూడెం- నేరడ, చింతకాని-వందనం, లచ్చగూడెం-అనంతరాం బీటీ రహదారులకు ఆయన శంకుస్థాపన చేశారు. చింతకాని ఎస్సీకాలనీలో రూ. 44లక్షలతో, నాగిలిగొండ ఎస్సీ కాలనీలో రూ. 85లక్షలతో నిర్మాణం చేపట్టే సీసీ రోడ్లకు, రూ. 5.25కోట్లతో చేపట్టే నాగిలిగొండ- తూటికుంట్ల బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల్లో సమస్యలపై స్థానికులు ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు వినతిపత్రాలు అందజేశారు. కలెక్టర్ దివాకర టీఎస్, సీపీ సునీల్‌దత్, సుడా ఛైర్మన్ దుర్గాప్రసాద్, డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణగౌడ్, మత్కేపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షుడు గోపి, పలువురు సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



కలకోటలో విద్యుత్ శాఖ సెక్షన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న భట్టి విక్రమార్క

● కాంగ్రెస్ సీపీఎం మధ్య పచ్చిగడ్డి వేస్తే బగ్గుమనే పరిస్థితులు ఉన్న బోనకల్లు మండలం గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, సహకార సంఘ అధ్యక్షులు మాదినేని వీరభద్రరావు ఆదివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. ఈ అంశం మండలంలో చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో అభివృద్ధి పనులు, అక్రమ మట్టి తవ్వకాలపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లినట్లు సీపీఎం వర్గాలు తెలిపాయి.

గ్రంథాలయాలు అందివస్తేనే.. విజ్ఞానదాయక ఫలాలు

కల్లూరు, న్యూస్‌టుడే

విద్యార్థులు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా గ్రంథాలయం, రీడింగ్ రూం ఏర్పాటుకు గత ప్రభుత్వం హయాంలో అనుమతులు మంజూరు చేశారు. కల్లూరు మండలంలో 14 గ్రంథాలయాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు కాగా.. 8 చోట్ల నిర్మాణాలు పూర్తయి అందుబాటులోకి వచ్చాయి. వీటిలో మర్లపాడు, చినకోరుకొండి, పెదకోరుకొండి, రఘునాథగూడెం, కొర్లగూడెం, పేరువంచ, యజ్ఞనారాయణపురం, చెన్నూరు-1 తదితర గ్రామాలున్నాయి. మరో ఆరు ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తికాక విజ్ఞాన ఫలాలు నేటికీ అక్కడి యువతకు అందుబాటులోకి రాలేదు. ప్రస్తుతం పోటీ పరీక్షల నోటిఫికేషన్లు వస్తున్నందున వీటినీ అందుబాటులోకి తేవాలని యువత కోరుతోంది.



కల్లూరు అంబేడ్కర్‌నగర్‌లో పనులు నిలిచి పిచ్చి మొక్కలు పెరిగిన గ్రంథాలయం, రీడింగ్ హాల్ నిర్మాణం

కల్లూరు పట్టణంలో ఒక్కటీ పూర్తికాకపాయె..!

● గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీల ప్రాంతాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తూ డీఎంఎఫ్‌టీ నిధులు ఒక్కో భవనానికి రూ. 25 నుంచి 40 లక్షల వరకు కేటాయించారు. కల్లూరు పట్టణంలోని అంబేడ్కర్‌నగర్, రామ్‌నగర్ సమీపంలో ఈ భవనాల నిర్మాణ పనులు లింటల్ దశలోనే ఆగి ఉన్నాయి. సబ్‌కలెక్టర్ కార్యాలయం సమీపంలో మరో గ్రంథాలయానికి శంకుస్థాపన చేసినా నేటికీ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. కల్లూరు పట్టణ పరిధిలో ఒక్కటీ పూర్తికాక పోవడంతో స్థానిక విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా కల్లూరు పట్టణంలో ఒక్క నిర్మాణాన్నయినా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని యువత విజ్ఞప్తి చేస్తోంది.

● చంద్రుపట్లలో 95శాతం పనులు పూర్తికాగా, తాళ్లూరు, చెన్నూరు ప్రాంతాల్లో 80శాతం పనులే పూర్తయ్యాయి. బత్తులపల్లి గ్రామంలో పునాదుల దశలోనే నిలిచి పిచ్చిమొక్కలకు నిలయంగా మారింది.

నివేదికలు పంపుతున్నాం..
- బి.రాజు, పీఆర్ ఏఈ

నిర్మాణాల దశల ప్రకారం ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నాం. కొందరు గుత్తేదారులు నిధులు మంజూరయిన తర్వాతే మిగిలిన పనులు చేస్తామంటూ నిలిపివేశారు. దీంతో పనులు ఆగాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపట్టి పనులు పూర్తయ్యేలా చూస్తాం.



ఎట్టకేలకు ఓపెన్ జిమ్ పనులు పూర్తి

ఈనాడు కథనానికి స్పందన

మధిర, న్యూస్‌టుడే: మధిర పట్టణంలోని టీవీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు నెలల కిందట పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించిన ఓపెన్ జిమ్ పనులను ఆదివారం పూర్తి చేశారు. 'నత్తనడకనే ఓపెన్ జిమ్ పనులు' శీర్షికతో ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు, గుత్తేదారు స్పందించారు. గతంలో నిర్మించిన ప్లాట్‌ఫారంపై దాదాపు 20 రకాల పరికరాలను ఆదివారం అమర్చారు. జిమ్ పరికరాల ఏర్పాటు పట్ల మధిర పట్టణ వాసులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

చింతకాని, న్యూస్‌టుడే: చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామారావు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో ఆయన మాట్లాడి అందుతున్న వైద్యసేవలు, మందుల పంపిణీ వివరాలు తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారిణి అల్తాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.



చింతకాని పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ రామారావు

శ్రీకృష్ణ శతక పద్య పఠన పోటీలు

మధిర పట్టణం: సుమిత్రా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 4న శ్రీకృష్ణ శతక పద్య పఠన పోటీలు ఏర్పాటు చేసినట్లు యూత్ బాధ్యులు డా. నిభానుపుడి సుబ్బరాజు తెలిపారు. స్థానిక శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పోటీలను 4వ తరగతి వరకు సబ్ జూనియర్స్, 5 నుంచి 7వ తరగతి వరకు జూనియర్స్ 8 నుంచి 10వరకు సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మాధారంలో కంటి వైద్య శిబిరం

కారేపల్లి: మాదారంలో ప్రముఖ ఫిజియో థెరపీ వైద్యుడు బాదావత్ రవి, మిషన్ వాక్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంప్యూటర్ పరికరాలతో వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీచేశారు.

మహదేవపురం ఎత్తిపోతల నీరు విడుదల

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: మధిర మండలం మహదేవపురంలోని ఎత్తిపోతల పథకం నుంచి రైతుల పొలాలకు సాగునీటిని ఆదివారం విడుదల చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పారుపల్లి విజయ్ కుమార్, సీనియర్ నాయకులు సూరంశెట్టి కిశోర్, కర్నాటి రామారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నీటి విడుదలను పరిశీలించారు. ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ప్రత్యేక దృష్టి సారించి ఈ పథకం ద్వారా నీటి విడుదలకు కృషి చేశారని వివరించారు. పుతుంబాక హన్మంతరావు, ఆదూరి శ్రీను, ఆవుల కిరణ్, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.



ఎత్తిపోతల పథకం వద్ద కాంగ్రెస్ నాయకులు

సీఈఆర్ క్లబ్ కమ్యూనిటీ హాలు ప్రారంభం

సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక పీవీఎన్ఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన సీఈఆర్ క్లబ్, కమ్యూనిటీ హాలును సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కొప్పుల వెంకటేశ్వర్లు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమానికి సత్తుపల్లి ఏరియా జీఎం ఎస్.వెంకటాచారి అధ్యక్షత వహించారు. డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబ సంక్షేమానికి యాజమాన్యం కట్టుబడి ఉందన్నారు. కార్మికులు వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు కమ్యూనిటీ హాలు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

భారాస కౌన్సిలర్లు నిజాలు తెలుసుకోవాలి: పుర ఛైర్మన్

కల్లూరు, న్యూస్‌టుడే: భారాస కౌన్సిలర్లు నిజాలు తెలుసుకుని, రాజకీయాలు చేయకుండా పట్టణ అభివృద్ధికి సలహాలు ఇవ్వాలని పుర ఛైర్మన్ ధరావత్ మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వార్డుల్లో వారికి తెలియకుండా పనులు జరుగుతున్నాయనడం సమంజసం కాదని, ప్రస్తుతం చేస్తున్న పనులు పురపాలక సంఘం ఎన్నికలకు ముందు కేటాయించినవేనని పేర్కొన్నారు. నూతనంగా పనులు ప్రారంభిస్తే అందరి సలహాలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతిపక్ష వార్డు కౌన్సిలర్లు ఉన్నచోట ప్రొటోకాల్ పాటిస్తున్నామని పేర్కొన్నారు.

ఆర్చరీ.. లక్ష్యానికి గురి

ఆర్చరీ క్రీడా పోటీలు ఆసక్తిగా జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పోటీల్లో 30, 50, 70 మీటర్ల విభాగాల వారీగా పోటీలు నిర్వహించారు. ఒక్కొక్కరికి ఆరు యారోలను ఇవ్వగా గురిచూసి కొట్టే క్రమంలో విభాగాల వారీగా విజేతలను ఎంపిక చేశారు. కొద్ది రోజులుగా సాధన చేసిన యువకులే పాల్గొన్నారు. నూతన అంశం కావడంతో వైరాకు చెందిన పలువురు యువత ఆసక్తిగా తిలకించారు. – వైరా, న్యూస్‌టుడే



సోమవరంలో బర్న్ ఓల్ గుడ్లగూబ



మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామంలో ఆదివారం గుడ్లగూబ ప్రత్యక్షమైంది. ఆవుల ప్రవీణ్ ఇంట్లోని పెరట్లో ప్రత్యేకంగా ఉన్న గుడ్లగూబ కనిపించింది. రెక్కకు గాయమై సేద తీరేందుకు వచ్చి అక్కడే చాలా సేపు ఉండిపోయింది. ఇది బర్న్ ఓల్ అనే గుడ్లగూబ అని ఎఫ్‌బీఓ స్వాతి తెలిపారు. దీనిని చూసేందుకు స్థానికులు తరలివచ్చారు. – వైరా, న్యూస్‌టుడే

వార్డుల్లో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

మధిర, న్యూస్‌టుడే: మధిర మున్సిపాలిటీలో ఆదివారం పలు వార్డుల్లో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ సందడిగా సాగింది. 20వ వార్డులో కౌన్సిలర్ బొల్లెద్దు విజయకుమారి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు చేతులమీదుగా వీటిని అందజేశారు. 21వ వార్డులో కౌన్సిలర్ రంగా రూప ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేశారు. 17వ వార్డులో కౌన్సిలర్ వినయ్‌కుమార్, 9వ వార్డులో కౌన్సిలర్ వై.చారులత ఆధ్వర్యంలో కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.



స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు

మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలి

కామేపల్లి: ప్రస్తుత భూముల మార్కెట్ ధర ప్రకారం రైతులకు పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు కాల్వ ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోతున్న రైతులు కామేపల్లిలో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. భూముల సేకరణకు సంబంధించి 2017లో నోటిఫికేషన్ జారీ చేసి, 2020లో ప్రభుత్వం అప్పటి మార్కెట్ ధర ప్రకారం రూ. 10,50,000 అవార్డు ప్రకటించిందన్నారు. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఎకరానికి రూ.25 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కృష్ణ, శ్రీనివాస్, వెంకన్న, రమేశ్ పాల్గొన్నారు.



కామేపల్లిలో ప్రదర్శన చేస్తున్న రైతులు

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ జాతర

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: ఖమ్మంపాడులో ఆదివారం ముత్యాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మండల పరిధిలోని రొంపిమళ్ల గ్రామంలోనూ ముత్యాలమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పెనుబల్లి, న్యూస్‌టుడే: శ్రావణమాసంలో ముత్యాలమ్మ తల్లికి గ్రామస్థులు చెల్లించుకునే మొక్కులను ఆదివారం వీఎం బంజర్‌లో ఘనంగా చెల్లించుకున్నారు. ఊరేగింపుగా వెళ్లి గ్రామంలోని బొడ్రాయి వద్ద పూజలు చేసి అనంతరం ముత్యాలమ్మ తల్లి దేవాలయం వద్ద బోనాలు సమర్పించారు.

వైరా, న్యూస్‌టుడే: శ్రావణమాసం పురస్కరించుకొని ఆదివారం వైరాలో ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. బోనాలతో ఊరేగింపు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బొర్రా ఉమాదేవి, మాజీ సర్పంచి బొర్రా పద్మావతి పాల్గొన్నారు.

కొణిజర్ల, న్యూస్‌టుడే: తీగలబంజరలో శ్రావణమాసం సందర్భంగా ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలంతా సామూహికంగా బోనాలు ఎత్తుకుని ఆలయానికి ప్రదర్శనగా వెళ్లారు. పూజల అనంతరం బోనాలు సమర్పించారు.



వైరా: తీగలబంజరలో బోనాలతో తరలివస్తున్న మహిళలు



తల్లాడ: మంగాపురం ముత్యాలమ్మ దేవాలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

తల్లాడ, న్యూస్‌టుడే: తల్లాడ మండలంలోని అన్ని గ్రామాల్లో ముత్యాలమ్మలకు బోనాల కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో చిన్నారులు, యువత, గ్రామ పెద్దలు అందరూ వేడుకలో పాల్గొన్నారు. ప్రభలను ఏర్పాటు చేసి డప్పు నృత్యాలతో ప్రదర్శనగా దేవాలయాల వద్దకు వెళ్లారు.

కల్లూరు: మండలం, పుర పాలక సంఘం పరిధిలోని శ్రావణమాసం సందర్భంగా ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారికి బోనాలు, అట్లు, పొంగలి నివేదించి మొక్కులు చెల్లించుకున్నారు. గోపాలదేవబోయినపల్లిలోనూ వేడుకలు సాగాయి.

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లి కృషి బైపాస్ రోడ్డులో బంగారు ముత్యాలమ్మ, పోతురాజుల విగ్రహాల పునఃప్రతిష్ఠ ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుడు రామడుగు విక్రమాచార్యులు ఆధ్వర్యంలో యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. స్థానిక మహిళలు అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. భక్తులు అమ్మవారికి చీరె, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

తల్లాడ, న్యూస్‌టుడే: తల్లాడలోని శ్రీకోటమైసమ్మ దేవాలయంలో అమ్మవారిని ఆదివారం రంగురంగుల గాజులతో ప్రత్యేక అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

ముదిగొండ, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తలక్ష్మీపురం, గంధసిరి, సువర్ణాపురం గ్రామాల్లో ఆదివారం బోనాల సందడి నెలకొంది. ముత్యాలమ్మ తల్లికి బోనాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. డప్పు చప్పుళ్లతో, నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా మహిళలు బోనాలు ఎత్తుకుని ఆలయాలకు తరలివెళ్లారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



మధిర మండలం ఖమ్మంపాడులో మొక్కులు చెల్లించుకునేందుకు వస్తున్న మహిళలు

హిందీ సబ్జెక్టు ఫోరం ఆవిర్భావం

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా హిందీ సబ్జెక్టు ఫోరం ఆవిర్భావ కార్యక్రమం ఖమ్మం నగరం రిక్కాబజారు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా మహ్మద్ మక్సూద్‌అలీ, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సునీత, లాల్ మహ్మద్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. జిల్లా విద్యాశాఖకు అనుబంధంగా హిందీ సబ్జెక్టు వికాసానికి నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ ఈ కమిటీ భాగస్వామ్యం ఉంటుంది.



గణపతి మండపానికి భూమిపూజ

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లిలోని జేవీఆర్ పార్కు ఎదురుగా ఉన్న మనగుడి ప్రాంగణంలో శ్రీప్రసన్న గణపతి 24వ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు గణపతి మండపం ఏర్పాటుకు నిర్వాహకులు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మందపాటి కేశవరెడ్డి, వడ్లపట్ల ఫణికుమార్, బోనగిరి చెన్నారావు పాల్గొన్నారు.

మినీ స్టేడియంలో వాకర్లపై వానరాల దాడి

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరులోని పలు ప్రాంతాల్లో వానరాలు గుంపులుగా చేరి జనంపై దాడులకూ తెగబడుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఆదివారం గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియంలోకి ఒక్కసారిగా వచ్చిన వానరాలు వాకర్స్‌పై దాడికి దిగాయి. దీంతో కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. పట్టణంలో కోతులు విపరీతంగా పెరిగి గ్రూపులుగా ఏర్పడి మనుషులపై దాడులు చేస్తున్నాయని, వీటి నియంత్రణకు పురపాలక అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

న్యూజెనెసిస్ ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి తుమ్మల

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లి పాత సెంటరులోని యూపీఎస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన న్యూజెనెసిస్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దినదినాభివృద్ధి చెందుతున్న సత్తుపల్లి పట్టణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించి వారి ఆదరణ పొందాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు. వైద్యులు కిరణ్ నాయక్, లక్ష్మీప్రసన్నలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, పుర ఛైర్‌పర్సన్ రెహానా బేగం, కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, గుగులోతు లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



దుకాణ సముదాయంలో.. వసతులేవి..?

మధిర, న్యూస్‌టుడే

మధిర ప్రధాన వీధిలోని విఘ్నేశ్వర ఆలయం వెనుక ఉన్న పురపాలక సంఘ దుకాణ సముదాయం వద్ద వసతులు కల్పించాలని అక్కడ పనిచేసే సిబ్బంది కోరుతున్నారు. మధిర పురపాలక సంఘంగా రూపాంతరం చెందకముందు 15 ఏళ్ల కిందట దీనిని నిర్మించారు. 2013లో మధిర నగర పంచాయతీగానూ, అనంతరం మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. అప్పట్లో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన దుకాణ సముదాయంలో దాదాపు 20 షాపులు ఉన్నాయి. వీటిలో వివిధ వ్యాపారాలు కొనసాగుతున్నాయి. నిత్యం వందలాది మంది వినియోగదారులు ఇక్కడకు వచ్చి వెళుతుంటారు. అయితే పురపాలక సంఘ పరిధిలోని ఈ దుకాణ సముదాయంలో కనీస సౌకర్యాలు కల్పించటం లేదు. పారిశుద్ధ్యం లోపిస్తోంది.

● దుకాణ సముదాయ నిర్మాణ సమయంలో శౌచాలయాన్ని ఏర్పాటు చేశారు. అయితే దానికి నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతోపాటు.. సరైన నిర్వహణ లేక అధ్వానంగా తయారైంది. తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. ప్రతి నెలా రూ. 40వేలకు పైగా అద్దె రూపేణా పురపాలక సంఘానికి సమకూరుతోంది. ఇప్పటికైనా ఇక్కడి సమస్యలపై దృష్టి సారించాలని అక్కడి యజమానులు, సిబ్బంది కోరుతున్నారు. ఈ సమస్యపై పురపాలక కమిషనర్ శామ్యూల్ బీఈ పాల్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా శౌచాలయాన్ని పరిశీలించి తగు చర్యలు చేపడతామని వివరించారు.



దుకాణ సముదాయంలో అధ్వానంగా ఉన్న శౌచాలయం

దేవేంద్రనాథ్‌కు నేతల నివాళి

ముదిగొండ, న్యూస్‌టుడే: ఖానాపురానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పొదిల రవికుమార్ తండ్రి పొదిల దేవేంద్రనాథ్ శనివారం మృతిచెందారు. ఖానాపురంలో దేవేంద్రనాథ్ పార్థివ దేహాన్ని భారాస పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, తుంబూరు దయాకర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, మున్నూరు కాపుసంఘం నేతలు సందర్శించి నివాళులర్పించారు. అంతిమయాత్రలో వద్దిరాజు రవిచంద్ర పాల్గొని దేవేంద్రనాథ్ పాడె మోశారు.

అభివృద్ధి పనులకు హామీ

కారేపల్లి: కారేపల్లిలో ప్రముఖ పురాతన శివాలయం మరమ్మతులకు బెల్ కంపెనీ డీజీఎం గుగులోతు రవి ఆదివారం సందర్శించి హామీ ఇచ్చారు. గర్భగుడికి ఆనుకుని ఉన్న మండపం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో తొలగించి నూతనంగా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నిర్వాహకులు బీమవరపు శ్రీనివాసరావు, యర్రా నరసింహారావు, సూర్యదేవర వెంకటేశ్వర్లు, ఇమ్మడి తిరుపతిరావు పాల్గొన్నారు.

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

ముత్యాలమ్మకు బోనాలు


రఘునాథపాలెం: బూడిదంపాడులో బోనాలతో మహిళలు

ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో బోనాల వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలు కాలనీల్లో ముత్యాలమ్మ ఆలయాల వద్ద భక్తులతో సందడి కన్పించింది. ఇందిరానగర్, ఖానాపురం, రోటరీ నగర్, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కోళ్లు, మేకలు బలిచ్చారు. రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో బోనాల జాతరను నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ పూజలు చేశారు. బూడిదంపాడులో డప్పు వాయిద్యాలు, పోతురాజులు, శివసత్తుల విన్యాసాలతో సందడి వాతావరణం నెలకొంది. నేలకొండపల్లితో పాటు పలు గ్రామాల్లో బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. కూసుమంచి మండలం చేగొమ్మలో ప్రభలు ఏర్పాటు చేసి ట్రాక్టర్లతో గ్రామంలో వైభవంగా ప్రదర్శన చేశారు. – న్యూస్‌టుడే బృందం


కూసుమంచి: ట్రాక్టర్లపై ప్రభలతో ప్రదర్శన..


ఖమ్మం చర్చికాంపౌండ్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో పూజలు

చారిత్రక కట్టడం కూలుతోంది..!

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే

నగరంలోని ఖిల్లా బయట, లోపల రాతి గోడలు ఉన్నాయి. అవి కూడా రాయిపై రాయిని పేర్చారు. వాటి బరువు ఎంత ఇప్పటికీ లెక్క తేలలేదు. అలాంటి భారీ ప్రాకారం ఓ పక్కన ఒరిగింది. బండపైన సున్నం, ఇటుకలతో నిర్మించిన కట్టడం కూలిపోయింది. దాని కిందే భారీ బండలు పక్కకు ఒరుగుతున్నాయి. జాఫర్ బావి పక్కనే ఉన్న ఈ రాతి గోడ ప్రమాదకరంగా మారింది. గోడకు ఆవలి వైపు మట్టి దిబ్బలు ఉండటంతో వాటి ఆధారంపై ఆగాయి. అలానే వదిలేస్తే కూలే అవకాశం లేకపోలేదు.

★ రాతి ప్రాకారాన్ని ఆనుకొని ఓ మార్గం ఉంది. ఖిల్లాలో నివాసం ఉంటున్న వారు ఈ దారి గుండా రాకపోకలు కొనసాగిస్తున్నారు. వారికి ప్రమాదం పొంచి ఉంది. రాళ్ల పక్కకు ఒరిగితే అంటిపెట్టుకొని ఉన్న భారీ బురుజు కూడా కూలే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు.

★ ఒరుగుతున్న రాతి ప్రాకారంలో రెండు చరిత్రక సాక్ష్యం చెప్పే ఆనవాళ్లు ఉన్నాయి. సొరంగ మార్గం పైభాగాన రాయిపై చేప బొమ్మ ఉంది. మరో వైపు కూలుతున్న భాగంలో సూర్యుడి ప్రతిబింబం ఉన్న భారీ శిల ఉంది. వాటి గురించి చరిత్రకారులు, వారసత్వ శాఖ శోధించాలి.

★ ఖిల్లాలో నిర్మించిన నాటి గోడల వయసు వెయ్యి ఏళ్లకు పైబడే ఉంటుంది. బండపై బండ పేర్చారు. ఇందు కోసం నాడు ఏనుగులతో రాళ్లను లాగించినట్లు చరిత్రకారుల మాట.

★ గోడ సంగతి అలా ఉంచండి. ఒక్క రాయిని సైతం సరి చేయలేని పరిస్థితి ఉందని ఓ వారసత్వశాఖ అధికారి చెప్పారు.


ఒరిగిన భారీ రాతి ప్రాకారం

గౌడ భవన నిర్మాణ భూమిపూజకు తరలిరండి

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం మండల కేంద్రం ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో 2018లో 29 గుంటల భూమిని అప్పటి ప్రభుత్వం కేటాయించిందని, సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా గౌడ సంక్షేమ భవన నిర్మాణానికి నిర్వహించే భూమిపూజకు పార్టీలకు అతీతంగా గౌడకుల బంధువులు తరలిరావాలని మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. ఆదివారం మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఏడాది కిందట ప్రభుత్వం భవన నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించిందని, నిధుల మంజూరులో కొంత జాప్యం కావడంతో పనులు ఆలస్యం అయ్యాయని వివరించారు. నిధుల మంజూరుకు సహకరించిన మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ గౌడ్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఆనాటి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. నెహ్రూగౌడ్, డా.బి.శ్రీనివాసరావు, సత్తయ్యగౌడ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాలసాని లక్ష్మీనారాయణ

తెగిన తీగ.. తప్పిన ముప్పు



ఖమ్మం నగర శివారు దానవాయిగూడెం కాలనీలో ఆదివారం విద్యుత్తు తీగ ఒకటి తెగింది. ఉదయం ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించిన కొందరు ఇళ్ల ఎదుట చేతికి అందే ఎత్తులో వేలాడుతున్న తీగను గమనించి విద్యుత్తు అధికారులకు సమాచారం అందించారు. సరఫరాను నిలిపివేసిన అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. ఇదే ప్రాంతంలో గతంలోనూ రెండు సార్లు తెగి పడ్డాయని, స్తంభం కూడా శిథిలావస్థకు చేరిందని స్థానికులు వాపోయారు.

– ఖమ్మం రోటరీనగర్, న్యూస్‌టుడే

ప్రాంగణం.. పశువులకు ఆవాసం

నేలకొండపల్లిలో ప్రయాణికుల కోసం నిర్మించిన ప్రాంగణం చెత్తాచెదారంతో నిండి, పిచ్చిమొక్కలు పెరిగాయి. ఆర్టీసీ అధికారులు బస్టాండు పర్యవేక్షణను గాలికి వదిలేయడంతో పశువులకు ఆవాసంగా మారింది. ఊరికి దూరంగా నిర్మించడంతో ప్రయాణికులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కొన్ని సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉంటుంది. ప్రస్తుతం కొన్ని బస్సులను ఆపకుండానే డ్రైవర్లు వెళ్లిపోతున్నారు. – న్యూస్‌టుడే, నేలకొండపల్లి గ్రామీణం



తేల్చరు.. కూల్చరు



నగరంలోని 37వ డివిజన్ పరిధిలోని పెంటగడ్డ బజారు రహదారి పనులు మొదలుపెట్టి రెండు నెలలు గడిచాయి. ఓ వైపు కాల్వ పనులు పూర్తి చేశారు. ఆ తర్వాత కార్పొరేషన్ అధికారులు రహదారి విస్తరణ అంటూ గోడలపై హద్దులు నిర్ధారించి వెళ్లారు. పనులు మాత్రం జరగడం లేదు. వాహనాలు రోడ్డుపైనే ఉంటున్నాయని, ఇరుకు దారిలో గతం కన్నా ఎక్కువ సమస్యలు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. విస్తరణతో పాటు రహదారి పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఖమ్మం సారథినగర్

వధూవరులకు జిల్లా జడ్జి ఆశీర్వాదం

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన న్యాయవాది మీసాల వెంకటేశ్వర్లు కుమారుడి వివాహ వేడుకకు మానుకోట జిల్లా జడ్జి కన్నోజు మురళీమోహన్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీనియర్ న్యాయవాది బోడేపూడి రాధాకృష్ణను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. శనివారం కన్నుమూసిన సీనియర్ న్యాయవాది, ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మాచిరాజు శోభనాద్రి రాజు పార్థివదేహానికి నివాళులర్పించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మందడపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యక్ష కార్యాచరణ

ఖమ్మం బుర్హాన్‌పురం, న్యూస్‌టుడే: పాత్రికేయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రత్యక్ష పోరాటం తప్పదని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నాయకులు హెచ్చరించారు. ఖమ్మం నగరంలోని ఓ హాల్‌లో ఆదివారం నిర్వహించిన నగరకమిటీ సమావేశంలో నేతలు మాట్లాడారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, ఆరోగ్యకార్డుల విషయంలో ప్రభుత్వ దాటవేత వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. వేణుగోపాల్, సైదులు, వెంకట్రావు, వెంకటేశ్వరరావు, పాపారావు పాల్గొన్నారు.

కాళికామాత విగ్రహ ప్రతిష్ఠ

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: బచ్చోడుతండాలో ఇటీవల నూతనంగా నిర్మించిన శ్రీ కాళికామాత ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. విగ్రహాన్ని సమీప గ్రామమైన లక్ష్మీదేవిపల్లి తండా సర్పంచి మూడు ఇందిరా-వెంకట్‌నాయక్ దాదాపు రూ.30వేలు ఖర్చుచేసి తండా వాసులకి అందించారు. వారి కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా సత్కరించారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు.

కోయచలకలో ఎంపీ రవిచంద్ర పర్యటన

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: భారత రాష్ట్ర సమితి నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మండలంలోని కోయచలకలో ఆదివారం పర్యటించారు. స్థానికంగా ఓ వివాహ వేడుకకు హాజరైన ఆయన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం మాజీ సర్పంచి మాదంశెట్టి హరిప్రసాద్ నివాసంలో స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. చెరుకూరి భిక్షమయ్య, తోట వెంకటేశ్వర్లు, మలిశెట్టి నవీన్, మేళ్లచెరువు భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం బుర్హాన్‌పురం: ఇటీవల మరణించిన భారాస నేత తాజుద్దీన్ కుటుంబాన్ని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆదివారం పరామర్శించారు. ఖమ్మం నగరంలోని ఆయన ఇంటికి వెళ్లి కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. పార్టీ పరంగా అన్ని రకాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. పగడాల నాగరాజు, షేక్ మగ్బుల్, బత్తుల మురళీప్రసాద్ ఉన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం కలెక్టరేట్ ఎదుట సోమవారం నిర్వహించే ధర్నాని విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నాగేశ్వరరావు, వెంకటేశ్ పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్

కామేపల్లి, న్యూస్‌టుడే: భాసిత్‌నగర్ గ్రామ ప్రధాన కూడలి సమీపంలో రహదారి బురదమయంగా మారి అధ్వానంగా ఉందని సీపీఎం మండల మాజీ కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. రహదారి అధ్వానంగా ఉండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

మహాధర్నా విజయవంతానికి పిలుపు


మాట్లాడుతున్న కట్టా శేఖర్‌రావు

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఒకటిన హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాలో జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్‌రావు కోరారు. ఖమ్మంలోని జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. 51శాతం ఫిట్మెంట్‌తో పీఆర్‌సీని ప్రకటించి అమలు చేయాలని, 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని తదితర డిమాండ్ల మేరకు ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రంగారావు, చిత్తలూరి ప్రసాద్, విజయ్‌అమృత్‌కుమార్, బ్రహ్మారెడ్డి, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హిందీ సబ్జెక్టు ఫోరం ఆవిర్భావం


మక్సూద్‌అలీ, శ్రీనివాస్

ఖమ్మం విద్యావిభాగం: జిల్లా హిందీ సబ్జెక్టు ఫోరం ఆవిర్భావ కార్యక్రమం జరిగింది. ఖమ్మం నగరం రిక్కాబజారు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఈకార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మహ్మద్ మక్సూద్‌అలీ, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సునీత, లాల్ మహ్మద్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. జిల్లా విద్యాశాఖకు అనుబంధంగా హిందీ సబ్జెక్టు వికాసానికి నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ ఈ కమిటీ భాగస్వామ్యం ఉంటుంది. ధనరాజ్, వెంకటేశ్వర్లు, షాబుద్దీన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలి

కామేపల్లి: ప్రస్తుత భూముల మార్కెట్ ధర ప్రకారం రైతులకు పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు కాల్వ ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోతున్న రైతులు కామేపల్లిలో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. భూముల సేకరణకు సంబంధించి 2017లో నోటిఫికేషన్ జారీ చేసి, 2020లో ప్రభుత్వం అప్పటి మార్కెట్ ధర ప్రకారం రూ.10,50,000 అవార్డు ప్రకటించిందన్నారు. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఎకరానికి రూ.25 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కృష్ణ, శ్రీనివాస్, వెంకన్న, రమేశ్ పాల్గొన్నారు.



కామేపల్లిలో ప్రదర్శన చేస్తున్న రైతులు

గ్రామీణ వైద్యుడు ఆకస్మిక మృతి

ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే: గ్రామీణ వైద్యుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఖమ్మం నగర శివారు అల్లీపురంలో నివసించే గుర్రం చంబయ్య(రాము)(50) గ్రామీణ వైద్యుడిగా పనిచేస్తున్నారు. ముదిగొండ మండలం గంధసిరిలో బంధువుల ఇంట్లో జరిగే ముత్యాలమ్మ వేడుకకు ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. ఛాతిలో నొప్పితో కుప్పకూలిపోయారు. ఖమ్మంకు తరలించి ఆసుపత్రిలో చేర్పించగా కొద్ది సేపటికే మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కొండ చిలువ కలకలం

నేలకొండపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పైనంపల్లిలో ఆదివారం తెల్లవారుజామున కొండచిలువ కలకలం సృష్టించింది. గ్రామానికి చెందిన గుగ్గిల వెంకటేశ్వర్లు ఇంటి సమీపంలో కొండచిలువ తారసపడింది. స్థానికుల సహాయంతో ఆయన దాన్ని చంపారు.

వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటనపై ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. బాలపేటకు చెందిన 50 ఏళ్ల పెంటి కృష్ణయ్య శనివారం(29న) తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఎక్కడ వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న అతడు మందులు వాడుతున్నారని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్ తెలిపారు.

పరిమితికి మించి.. యథేచ్ఛగా తరలించి

నేలకొండపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

గ్రానైట్ రాళ్లను తరలించే లారీల పై క్వారీ యజమానులు పరిమితికి మించి భారం వేస్తుండటంతో వాహనదారులకు శాపంగా మారుతోంది. గనులు, రవాణాశాఖల ఆదేశాల మేరకు గ్రానైట్ రాళ్లను తరలించే ముందు తప్పనిసరిగా వే బిల్లు, లేదా ఈ పర్మిట్‌ను తీసుకోవాల్సి ఉంటుంది. మోటారు వాహనాల చట్టం ప్రకారం లారీలలో పరిమితికి మించి రాళ్లను రవాణా చేయకూడదు. అవి జారిపోకుండా రక్షణగా గొలుసులతో బంధించాలి. వాటి వెనుక వెళ్లే వాహనదారులపై దుమ్ము, ధూళి పడకుండా టార్పాలిన్ కప్పాల్సి ఉన్నప్పటికీ నిబంధనలను తుంగలో తొక్కారు. ఇష్టం వచ్చినట్లు అధిక బరువు ఉన్న వాటిని తరలిస్తుండటంతో ప్రమాదాలకు గురైనప్పుడు అవి ఇతర వాహనాలపై పడిన సందర్భాలు ఉన్నాయి. రద్దీ తక్కువ ఉన్న సమయాల్లో మాత్రమే రవాణా చేయాల్సి ఉన్నా యథేచ్ఛగా ఎప్పుడు పడితే అప్పుడే తరలిస్తున్నారు. తాజాగా నేలకొండపల్లి సమీపంలో జాతీయ రహదారిపై డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా గ్రానైట్ లారీ ప్రమాదానికి గురై బండరాళ్లు రహదారిపై జారిపడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది.


రద్దీగా ఉండే ఖమ్మం, కోదాడ ఎన్‌హెచ్‌పై అడ్డుగా పడిన గ్రానైట్ రాళ్లు